

పాలకుర్తిలో పురస్కారాలు అందుకున్న సాహితీ వేత్తలు

సోమనాథ సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలి

- తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు
- పాలకుర్తిలో పురస్కారాల ప్రదానోత్సవం

పాలకుర్తి, డిసెంబరు 31 : పాల్కూరికి సోమనాథుడి సాహిత్యానికి విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందని, దీనికి సోమనాథ కళాపీఠం దోహపడుతుందని తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాలులో సోమనాథ కళాపీఠం సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన పురస్కారాల ప్రదానం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి ఆలయం సమీపంలోని పాల్కూరికి సోమనాథుడి విగ్రహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహితీ విప్లవమూర్తి పాల్కూరికి సోమనాథుడి పేరుతో కళాపీఠం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సాహిత్యం, కళా, పండిత, పరిశోధన రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి రెండేళ్లకోసారి పురస్కారాలు అందించడం మహత్కార్యమని అన్నారు. సోమనాథుడు సమాజంలోని పేదలను చైతన్యం చేయడం కోసమే గ్రంథాలు రాశారని గుర్తుచేశారు. మూడు దశాబ్దాలుగా పురస్కారాలు అందజేస్తున్న సోమనాథ కళాపీఠం సేవలు శ్లాఘనీయమని కొనియాడారు. అనంతరం పురస్కారాలు ప్రదానం చేశారు.

సోమనాథ సాహిత్య పురస్కారాన్ని డాక్టర్ కానుకుర్తిశెట్టి సోమశేఖర్, సామాజిక శోధన పురస్కారాన్ని డాక్టర్ నలిమెల భాస్కర్, రంగస్థల పురస్కారాన్ని మంచాల రమేష్, పందిల్ల శేఖర్‌బాబు.. రాజయ్య శాస్త్రి స్వచ్ఛంద భాషా సేవ పురస్కారాన్ని డాక్టర్ మైథిలి అబ్బరాజు, చలపతిరావు సాహిత్య పురస్కారాన్ని ఎం.ఎస్.ఆర్. వెంకటరమణ, ప్రాచీన చరిత్ర వైజ్ఞానిక పరిశోధన పురస్కారాన్ని డాక్టర్ సి.ఎస్.ఆర్. ప్రభు, రాపోలు సోమయ్య ప్రతిభా పురస్కారాన్ని డాక్టర్ ఆరూరి మహేందర్, దేవగిరి రాజయ్య స్మారక పురస్కారాన్ని బూస రేణుకారాధ్య స్వీకరించారు. కార్యక్రమానికి కళాపీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ సత్యనారాయణ అధ్యక్షత వహించగా, ప్రొఫెసర్ ప్రభంజన్‌కుమార్, ప్రొఫెసర్ అవుటి జగదీష్, సర్పంచు యాకాంతరావు, నర్సింహారెడ్డి, మార్గం లక్ష్మీనారాయణ, జక్కుల రవీందర్, గూడూరు లెనిన్ వీరమనేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



జనగామ స్వర్ణకళామందిర్ ఏరియాలో కేక్ కొంటున్న యువకులు



ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా రంగులు కొంటున్న మహిళలు

చిన్ని, చిన్ని, ఆశ..

కోటి ఆకాంక్షలతో ఆంగ్ల నూతన సంవత్సరానికి స్వాగతం



సిద్దిపేట రోడ్డులో ఓ బేకరీ షాపులో కేకులు కొంటున్న ప్రజలు

లింగాలఘణపురం/జనగామ టౌన్, డిసెంబరు 31: కాలచక్రం గిర్రున తిరిగింది.. చూస్తుండగానే ఏడాది గడిచిపోయింది. ఎన్నో చేదు జ్ఞాపకాలను మిగిల్చి.. తీపి అనుభూతులను పంచి.. మరెన్నో లక్ష్యాలను సాధించిపెట్టిన 2023 కాలగర్భంలోకి చల్లగా జారుకుంది. బోలెడు ఆశయాలను ముందుంచుతూ నూతన సంవత్సరం 2024 కోటి ఆశలతో స్వాగతం పలికింది. ఆదివారం అర్ధరాత్రి.. గడియారం ముల్లు 12గంటలు దాటిన మరుక్షణమే 2024 కొత్త సంవత్సరం కొత్త క్యాలెండర్ రూపంలో కేరింతల స్వాగతాలతో ప్రవేశించింది. ఇప్పుడు అందరి లక్ష్యం ఒక్కటే.. అందరూ బాగుండాలి.. అందులో నేనుండాలనే నినాదమే హృదయ నాదమై స్పృశిస్తోంది. బడుగుల బతుకుల్లో వెలుగులు నింపేలా.. భారమైన గుండెలను తేలిక చేసేలా.. ముందుకు సాగాలని జిల్లా ప్రజలు ముకుళిత హస్తాలతో కాలచక్రాన్ని వేడుకుంటున్నారు.



నూతన సంవత్సరంపై ఎవరేమన్నారంటే.. 8లో..

విధుల్లో నిర్లక్ష్యం వద్దు: ఏసీపీ



పోలీసుల కిట్లను తనిఖీ చేస్తున్న ఏసీపీ

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 31: పోలీస్ సిబ్బంది వారి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఏసీపీ సుందరగిరి శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. పోలీసు సిబ్బంది కిట్‌బాక్స్‌లను పరిశీలించారు. సిబ్బంది వద్ద ఉండాల్సిన వస్తువులు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసి వారి పేర్లను నమోదు చేసుకున్నారు. లాఠీలను ఎందుకు బయటకు తీసుకెళ్లడం లేదని ప్రశ్నించారు. అనంతరం రికార్డు గదులను, ఎస్సై, సీఐల చాంబర్‌లను, కంప్యూటర్ గదిని, సెల్‌లను, పోలీసులు వివిధ కేసుల్లో పట్టుకున్న బైక్‌లను, వాహనాలను తనిఖీ చేయడమే కాకుండా వాటికి సంబంధించిన రికార్డులను చూశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పోలీసుల పట్ల నమ్మకం కలిగేలా ప్రవర్తించాలన్నారు. పెట్రోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ నట్ల రాజు, ఎస్సైలు నాగరాజు, హరికృష్ణ, ఏఎస్సైలు రాజమౌళి, రవికుమార్, బేగ్, సిబ్బంది జి.కుమార్, రమేష్, శ్రీనివాస్, నరేష్, రాఘవేందర్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

భూ తగాదాలో అన్నపై
తమ్ముడి దాడి

నర్మెట, డిసెంబరు 31: మండలంలోని సూర్యబండతండాలో భూ వివాదంలో అన్నదమ్ములు గొడవపడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన భూక్య రవీందర్, రమేష్ ఇద్దరు అన్నదమ్ములు. వీరికి తండ్రి నుంచి వచ్చిన బోరును ఉమ్మడిగా వాడుకుంటుండగా కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఆదివారం అన్నదమ్ములు మరోసారి ఘర్షణ పడ్డారు. సహనం కోల్పోయిన రమేష్ అన్న రవీందర్ తలపై పారతో కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయాలతోనే ఆయన పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా వారు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ అడగగా బాధితుడి నుంచి తనకు ఏలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అజరా హాస్పిటల్‌లో హెల్త్ చెకప్ క్యాంపెయిన్ ప్రారంభం

హనుమకొండ అర్బన్, డిసెంబరు 31: అజరా హాస్పిటల్‌లో హెల్త్ చెకప్ క్యాంపెయిన్ ప్రారంభమైంది. జనవరి 1వ తేదీ నుంచి 31 వరకు ప్రివెంటివ్ హెల్త్ చెకప్ క్యాంపెయిన్‌ని ప్రారంభించడం గర్వంగా ఉందని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. 54శాతం వరకు తగ్గింపుతో బాడీ చెకప్ ఉంటుందన్నారు. పరిమిత స్లాట్‌లు అందుబాటులో ఉన్నందున అజరా హాస్పిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 9391009701 లేదా, 9391009702 సంప్రదించాలన్నారు.

నేడు జూపార్కులో సందర్శకులకు అనుమతి

హనుమకొండ సిటీ, డిసెంబరు 31: హనుమకొండ హంటర్‌రోడ్డులోని కాకతీయ జూలాజికల్ పార్కులో సోమవారం సెలవుతో నిమిత్తం లేకుండా సందర్శకులకు అనుమతి కల్పించినట్లు ఇన్‌చార్జి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ వి.రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సిమ్మింగ్ సౌత్ వెస్ట్ జోన్
పోటీలకు కేయూ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, డిసెంబరు 31: జనవరి 2 నుంచి 4 వరకు తమిళనాడులోని ఎస్ఆర్ఎంఐఎస్టీ యూనివర్సిటీలో జరిగే సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు పురుషుల, స్త్రీల సిమ్మింగ్ కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసి ప్రకటించినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ పెద్దమళ్ల శ్రీనివాసరావు ఆదివారం ప్రకటించారు. 2023-24 ఏడాదికిగాను కాకతీయ యూనివర్సిటీ నుంచి జట్టు పాల్గొంటుందని వెల్లడించారు. ఎంపికైన వారిలో మెన్స్ విభాగంలో కేటీ రాఘవేందర్, పి.శ్రవణ్‌చంద్ర (డీఆర్ఎస్ డీసీ డిగ్రీ కళాశాల, ఖమ్మం), బి.శ్రీకాంత్ నాయక్, (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ), కె.అక్షిత్ (కేయూ ఇంజనీరింగ్ కళాశాల, హనుమకొండ) ఎంపికయ్యారు. అలాగే వుమెన్స్ విభాగంలో బి.మహేశ్వరి, (బాలాజీ వుమెన్స్ డిగ్రీ కళాశాల, నర్సంపేట) ఎంపికైనట్లు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు వెల్లడించారు.

జట్టుకు మహబూబాబాద్‌లోని నలంద డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె.రమేశ్ మేనేజర్‌గా వ్యవహరిస్తారు. జట్టుకు కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావుల అభినందించారు.

కొత్త సంవత్సరం... కోటి ఆశలు

● జాబ్ క్యాలెండర్ వైపు నిరుద్యోగుల చూపు ● సంక్షేమ పథకాలపై కొత్త ఆశలు ● ఊరిస్తున్న నామినేటెడ్ పదవులు ● పాలనా పరంగా చోటు చేసుకోనున్న మార్పులు

హనుమకొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కాలచక్రంలో మరో ఏడాది కరిగిపోయింది. తీపి జ్ఞాపకాలు, చేదు అనుభవాలు మిగిల్చి కాలగర్భంలో కలిసి పోయింది. కొత్త ఆశలు. సరికొత్త ఆకాంక్షలతో కొత్త సంవత్సరం ఆరంభమైంది. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు 2023 సంవత్సరానికి వీడ్కోలు పలికి 2024 సంవత్సరానికి ఉత్సాహంగా సంబరంగా స్వాగతం పలికారు. కొత్త సంవత్సరంలో అంతా శుభమే జరగాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నూతన సంవత్సరంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆశలు, ఆకాంక్షలను వ్యక్తీకరించుకుంటున్నారు. గతం గతః... కొత్త ప్రభుత్వం ఏర్పాటయిన నేపథ్యంలో కనీసం ఈ సంవత్సరమైన తమ ఉద్యోగాలు రావాలని నిరుద్యోగులు ఆశ పడుతున్నారు. సంక్షేమ పథకాలు అందాలని నిరుపేదలు కోరుకుంటున్నారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావాలని అన్నివర్గాలు కోరుకుంటున్నారు. బీఆర్ఎస్‌ను ఓడించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అభివృద్ధి పరుగులు పెట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు కొత్త సంవత్సరం అంతా ఎన్నికల సందడే ఉండనున్నది. లోక్‌సభ, శాసన మండలి, పంచాయతీ ఎన్నికలపై నాయకులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నామినేటెడ్ పదవులను కాంగ్రెస్ నేతలను ఊరిస్తోంది.

● జాబ్ క్యాలెండర్...

కొత్త సంవత్సరంపై నిరుద్యోగులు కోటి ఆశలు పెట్టుకున్నారు. 2023 సంవత్సరం వారికి ఉద్యోగాల విషయంలో చేదు అనుభవాలనే మిగిల్చింది. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ, గ్రూప్ 1, గ్రూప్ 2 సహ కమిషన్ నిర్వహించిన పలు పరీక్షల్లో అవకతవకలు, వరుస వాయిదాల నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారు. ఈ క్రమంలో తాము అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ అన్నట్టుగానే జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించింది, మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చింది. కొత్త సంవత్సరంలో ఏ ఏ ఉద్యోగాలకు ఎప్పుడెప్పుడు నోటిఫికేషన్లు ఇచ్చేది తేదీలతో సహా ప్రకటించింది. నిరుద్యోగులు ఈ జాబ్ క్యాలెండర్‌పై కోటి ఆశలు పెట్టుకున్నారు. ఇది అమలైతే ఈ కొత్త సంవత్సరంలో తమకు ఉద్యోగాలు దొరకడం ఖాయమన్న ఆశతో ఉన్నారు.

నిరుపేద ప్రజలు ఈ కొత్త సంవత్సరం నుంచి అమలు కానున్న సంక్షేమ పథకాలపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆరు గ్యారెంటీలపేరుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. పథకాల అమలు కోసం కోసం ప్రజలు ఎంతో ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు. ఈ పథకాల అమలుకు ప్రభుత్వం అప్పుడే శ్రీకారం కూడా చుట్టింది. గృహలక్ష్మి పథకంలో భాగంగా మహిళకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణాన్ని అందుబాటులోకి తెచ్చింది. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని ప్రభుత్వం చెబుతుండడంతో ఈ పథకాలపై అన్ని వర్గాల ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

● పెండింగ్ పనులు పూర్తయ్యేనా ?

ఉమ్మడి జిల్లాలో అనేక అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని శిలాఫలకాలకే పరిమితమయ్యాయి. కనీసం ఈ కొత్త సంవత్సరంలోనైనా వీటికి మోక్షం లభించాలని ప్రజలు కోరుతున్నారు. కనీసం ఈ ఏడైనా కాళోజీ కళాక్షేత్రం , వేయిస్తంభాల గుడి కళ్యాణ మండపం, పాతిమానగర్ సమాంతర బ్రిడ్జి, రింగ్ రోడ్డు, వడ్డెపెల్లి బండ్ సుందరీకరణ, స్మార్ట్ రోడ్లు, రూ 1100 కోట్ల వ్యయంతో నిర్మాణం అవుతున్న సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పనులు పూర్తికావాలని కోరుతున్నారు. మాస్టర్ ప్లాన్‌కు కనీసం ఏ ఏడు అయినా కొత్త ప్రభుత్వం ఆమోద ముద్ర వేయాలని కాంక్షిస్తున్నారు. ములుగులో గిరిజన విశ్వవిద్యాలయం పనులు మొదలు కావాలనీ, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీకి అడుగులు పడాలని కోరుతున్నారు. పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పంచాలనీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద కొత్త ఇళ్ల నిర్మాణం జరగాలని కోరుతున్నారు.

● ఎన్నికలపై ఆశలు:

గత సంవత్సరం చివరలో మొదలైన ఎన్నికల సందడి ఈ కొత్త సంవత్సరం అంతా కొనసాగనున్నది. కొత్త సంవత్సరం ఆరంభంలో జరగనున్న పార్లమెంట్, ఎమ్మెల్సీ, పంచాయతీ ఎన్నికలపై నాయకులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన నాయకులు లోక్ సభ ఎన్నికల్లో, అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూస్తున్నారు. పంచాయతీ ఎన్నికలపై కూడా ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆశావ‌హులు ఇప్పటికే టికెట్ల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు.

● నామినేటెడ్ పదవులపై దృష్టి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నాయకులు నామినేటెడ్ పదవులపై దృష్టి సారించారు. గట్టిగా ప్రయత్నిస్తే ఈ కొత్త సంత్సరం ఏదైనా ఒక పదవి రాకపోతుందా అని భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నించి భంగపడ్డవారు, పోటీ చేసి ఓడిపోయినవారు, అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసినవారు, పార్టీ కోసం ఎంతో కాలంగా పని చేస్తున్నవారు, సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు అనేక మంది నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. పలు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులు వీరిని ఊరిస్తున్నాయి.

● అవిశ్వాసాలు

అవిశ్వాస తీర్మానాలతో పలువురి మున్సిపల్ చైర్మెన్ పదవులు ఊడిపోనున్నాయి. ఈ సంవత్సరం ఇది వారికి చేదు అనుభవమే కానున్నది. ఉమ్మడి జిల్లాలో వరంగల్ నగర పాలక సంస్థతో పాటు తొమ్మిది మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటి చైర్మెన్లు అందరు బీఆర్ఎస్‌కు చెందిన వారే. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం అప్పుడే వీటిపై దృష్టి సారించింది. అవిశ్వాస తీర్మానాలు పెట్టడం ద్వారా వారిని గద్దె దించి కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికి ఇచ్చేందుకు అప్పుడే పావులు కదుపుతోంది. జనగామ మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానానికి అప్పుడే ప్రయత్నాలు మొదలయాయి.

● మార్పులు చేర్పులు:

ఈ కొత్త సంవత్సరం పాలనా పరంగా అనేక మార్పులు చేర్పులు చోటు చేసుకోనున్నాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే దీనిపై దృష్టి సారించింది. పాలనను ప్రజల వద్దకు చేర్చేందుకు మార్పులకు అప్పుడే శ్రీకారం చుట్టింది. ఈ ఏడు ఈ దిశగా ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఆ ప్రభావం ఉమ్మడి వరంగల్ జిల్లాలో కూడా పడనున్నది. బదిలీలు, పదోన్నతులతో కొత్త సంవత్సరం తమకు తీపి కబురు అందవచ్చునని ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

» జోరుగా కొత్త సంవత్సరం వేడుకలు



హనుమకొండ హరిత హోటల్‌లో యువతుల నృత్యాలు

హనుమకొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): 2024 కొత్త సంవత్సరానికి ప్రజలు కోటి ఆశలతో స్వాగతం పలికారు. రాత్రి 12 గంటలకు పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి సాదరంగా ఆహ్వానించారు. నూతన సంవత్సరంలో అన్ని శుభాలే జరగాలని, అందరూ సంతోషంగా, సుఖంగా ఉండాలని ఆకాంక్షిస్తూ చరవాణిల్లో సందేశాలు వెల్లువెత్తాయి. హ్యాపీ న్యూయర్.. అంటూ ఆనందోత్సహాలతో కేరింతలు కొట్టారు. 2024 ప్రవేశానికి శుభసూచనగా పెద్దఎత్తున బాణాసంచాను పేల్చారు. కేకులు కట్ చేశారు. స్వీట్లను పంచుకున్నారు. పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. సంతోషంతో నృత్యాలు చేశారు. కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ పాటలు పాడారు.

ఏరులై పారిన మద్యం

కొత్త సంవత్సరం పుణ్యమా.. అని మద్యం ఏరులై పారింది. ఉదయం నుంచే మద్యం షాపులు కొనుగోలు దారులతో కిటకిటలాడుతూ కనిపించాయి. సాయంత్రం మద్యానికి గిరాకీ మరింత పెరిగింది. రాత్రి ఒంటి వరకు మద్యం అమ్మకాలు జోరుగా సాగుతూనే ఉన్నాయి. బార్లు, రెస్టారెంట్లు మందుబాబులతో కిటకిటలాడాయి. హోటళ్లు, డాబాలు, రిసార్టులు అర్ధరాత్రి వరకు విందు లు, వినోదాలతో హోరెత్తాయి. హాస్టళ్లలో విద్యార్థులు కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఆట, పాటలతో కేరింతలు కొట్టారు. అపార్టుమెంట్ల సెల్లార్లు, రూఫ్‌టాప్‌లు కొత్తపార్టీ వినోదాలతో ఊగిపోయాయి. రంగురంగుల విద్యుద్దీపాల నడుమ అపార్టుమెంట్లువాసులు తెల్లవారుజాము వరకు పార్టీల్లో మునిగి పోయారు. నగరంలో పేరున్న పలు హోటళ్లు కూడా న్యూ ఇయర్ ఈవెంట్లను నిర్వహించాయి. పలు మధ్యతరగతి, సంపన్న కుటుంబాలు పెద్దసంఖ్యలో హాజరైన ఈ ఈవెంట్లు డీజే మ్యూజిక్‌తో ఆకట్టుకున్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టరాని సంతోషంతో న్యూ ఇయర్ వేడుకలను జరుపుకున్నారు. ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు.

కేకులు, స్వీట్లు

కొత్త సంవత్సరం సంబరాల్లో భాగంగా చాలా మంది ఇళ్లలో కేకులు కట్ చేశారు. స్వీట్లను పంచుకున్నారు. ఉదయం నుంచి అన్ని బేకరీ షాపులు, స్వీట్ షాపులు కొనుగోలుదారులతో పోటెత్తాయి. న్యూయిర్‌ను పురస్కరించుకొని బేకరీలు వివిధ రకాల కేకులను తయారు చేసి సిద్ధంగా ఉంచాయి. వీటిపై ఆఫర్లను కూడా ఇచ్చాయి. మూడు కిలోలకు మించి కేక్ కొన్నవారికి ఒక లీటరు కూల్ డ్రింక్ ఉచితంగా ఇచ్చారు. మరికొన్ని చోట్ల 5కిలోల కేకు కొంటే కిలో కేక్ ఫ్రీగా అందచేశారు. స్వీట్‌షాపులు సైతం ఆఫర్లతో ఆకట్టుకున్నాయి. రెండు కిలోలకు మించి స్వీట్లు కొన్నవారికి పావుకిలో మిక్సర్ ఉచితంగా అందచేశాయి.



పద్మాక్షి గుట్ట సమీపంలోని హాస్టల్ లో న్యూయర్ వేడుకలు

యూత్ జోష్..

నగరంలో న్యూ ఇయర్ సందడి

హనుమకొండ క్రైం, డిసెంబరు 31: నూతన సంవత్సర వేడుకలు ఫుల్ జోష్‌గా జరిగాయి. అర్ధరాత్రి నగరంలో ఉత్సాహపూరిత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. వరంగల్ కమిషనరేట్ పోలీసులు నిబంధలను కఠినతరం చేసినా యువత స్పీడుకు కళ్లెం వేయలేకపోయారు. కొందరు యువకులు పోలీసుల నిబంధనలు అతిక్రమించి మత్తు జోష్‌లో మునిగిపోయి రోడ్లపై చెక్కర్లు కొట్టగా.. మరి కొందరు ఇళ్లకే పరిమితమై వేడుకల్లో మునిగిపోయారు. రాత్రి 12 గంటలు కొట్టగానే నగరం భారీ శబ్దాలతో బాణాసంచా మోతలతో దద్దరిల్లింది. యువతీ, యువకుల కేరింతలతో కొత్త సంవత్సర వేడుకలు మిన్నంటాయి. డీజే సౌండ్స్ ఏర్పాటు చేసుకుని డ్యాన్స్‌ల్లో మునిగిపోయారు. రోడ్లపై కుర్రకారు ద్విచక్రవాహనాలపై చక్కర్లు కొడుగూ సెలబ్రేషన్స్‌లో మునిగిపోయారు. రయ్.. రయ్.. మంటూ బైక్‌లపై పర్యటిస్తూ రెచ్చిపోయారు. కొత్త సంవత్సర వేడుకలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు పోలీసులు జాగ్రత్తపడ్డారు. సాయంత్రం 6 గంటల నుంచే శాతిభద్రతల పరిరక్షణ కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో గొడవలు, అల్లర్లు తలెత్తకుండా ఉండేందుకు లా అండ్ ఆర్డర్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ ఆదేశాల మేరకు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతీ సెంటర్‌లో పోలీసు పికెటింగ్‌లో ఏర్పాటు చేశారు. 380 మంది పోలీసులు రంగంలోకి దిగి డ్యూటీలు చేశారు. అడుగడుగునా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. సుమారు 542 మంది మందుబాబులను అదుపులోకి తీసుకున్నారు. ఈ- చలానా పద్ధతిలో ఫైన్‌లు విధించి ఉట్టి చేతులతో పంపించారు. బైక్‌లపై త్రిపుల్ రైడింగ్ చేయకుండా పోలీసులు డేగకళ్లతో వీక్షించారు. ప్రమాదాలు జరుగకుండా పోలీసులు రోడ్లపై నిఘా పెట్టారు. మహిళా వసతి గృహాలు, మహిళా కళాశాలల వద్ద పోలీసులు మఫ్టీ లో కాపుకాచి ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. ఇంకా కొందరు యువత గంజాయి మత్తులో తూగుతూ రోడ్లపై హల్‌చల్ చేశారు. నగరంలోని మహిళలు నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని 31 రాత్రి 10 గంటల నుంచే వాకిళ్లలో ముత్యాల ముగ్గులు వేసే పనిలో నిమగ్నమయ్యారు. అనంతరం మహిళలు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కేకులు కట్‌చేసి స్వీట్లు పంచుకున్నారు. సీపీ కార్యాలయంలో కమిషనర్ కిశోర్ ఝా కేక్ కట్ చేసి సిబ్బందికి పంచారు.



నగరంలోని ఓ వైన్స్ వద్ద గుమికూడిన జనం

వైన్స్‌షాపుల వద్ద హంగామా

డిసెంబరు 31 సందర్భంగా ఆదివారం రాత్రి పోలీసు కమిషనరేట్ పరిధిలోని మద్యం షాపుల వద్ద యుద్ధ వాతావరణం నెలకొంది. మద్యం కొనుగోలు చేసేందుకు మద్యంప్రియుల పోటెత్తారు. వైన్స్, బార్‌షాపుల ముందు దడికట్టారు. ఇక నగరంలోని ప్రతీ మద్యం షాపుల ముందు జాతర వాతావరణం నెలకొంది. నగరంలోని అన్ని బార్లు, వైన్స్, రెస్టారెంట్లతో పాటు నగర శివారులో సైతం వెలసిన బెల్టుషాపుల వద్ద మందు ప్రియులు ఫుల్లుగా తాగి చిందులు వేశారు. ఇదే అదునుగా భావించిన కొందరు మద్యం వ్యాపారులు ఇష్టం వచ్చిన రేట్లకు అమ్ముకున్నట్టు యువకులు వాపోయారు.

ఎంజీఎం ఆస్పత్రిని ప్రక్షాళన చేస్తాం..

● హెల్త్ సిటీ పేరుతో పెద్దాస్పత్రి అభివృద్ధి కుంటు పడింది ● దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

హనుమకొండ అర్బన్, డిసెంబరు 31: ఎంజీఎం ఆస్పత్రిలో మెరుగైన సేవలు విస్తృతపరిచేందుకు ఆస్పత్రిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తామని రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఎంజీఎం ఆస్పత్రిని ఆదివారం మధ్యాహ్నం కొండా సురేఖ సందర్శించారు. తొలుత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ.. మెరుగైన సేవలే ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొన్నారు. పేద రోగులకు అన్ని రకాల వసతులను ప్రభుత్వం కల్పించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఉత్తర తెలంగాణకే తలమానికంగా ఉన్న ఎంజీఎం ఆస్పత్రి గుండెకాయ లాంటిదన్నారు. దీనిని కాపాడుకుంటామని స్పష్టం చేశారు. 14 ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయని, మందుల కొరత లేకుండా అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఇటీవల కోతుల బెడద వల్ల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని వెంటనే అధికారులు అప్రమత్తమై పునరుద్దరించారని మంత్రి సురేఖ చెప్పారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు ఐదు జనరేటర్ల ద్వారా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. ఈ ఘటన వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. తొమ్మిది రోజుల వ్యవధిలో 25కు కరోనా కేసులు పెరిగాయని సురేఖ వెల్లడించారు. కరోనా రోగులకు ప్రత్యేక వార్డుల్లో చికిత్స అందుతోందని అన్నారు. ఎంజీఎంలో ప్రస్తుతం 25 మంది కరోనాతో చికిత్స పొందుతున్నారని, వీరిలో ఎలాంటి ప్రాణాపాయ లక్షణాలు లేవని ఆమె స్పష్టం చేశారు. ఈ నెల 21 నుంచి 170 మంది రోగులకు కరోనా పరీక్షలు నిర్వహించగా 25 మందికి పాజిటివ్ ఉన్నట్లు నిర్ధారణ అయిందని, పది మంది ఎంజీఎంలో చేరి చికిత్స పొందుతున్నారని తెలిపారు. 1200 ఆక్సిజన్ బెడ్స్, మూడు ఆక్సిజన్ ట్యాంకులు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. కాగా, హెల్త్‌సిటీ పేరుతో నిర్మిస్తున్న ఆస్పత్రి గురించి ఎంజీఎం అధికారుకు సమాచారం లేకపోవడం పట్ల విస్మయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ చంద్రశేఖర్, కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డి.మోహన్‌దాస్, టీఎస్ఎంఐడీసీఎస్ ఇ.దేవేంద్ర కుమార్, ఎన్‌పాడీసీఎల్ డీఈ మల్లికార్జున్, ఆర్ఎంఓ మురళి, అడిషనల్ ఆర్ఎంవోలు, వైద్యులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

పేదరిక నిర్మూలనే ప్రధాని మోదీ ధ్యేయం

కేంద్ర మంత్రి బీఎల్.వర్మ

హనుమకొండ రూరల్, డిసెంబరు 31: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని కేంద్ర సహకార శాఖ, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి బీఎల్.వర్మ తెలిపారు. ఆదివారం హనుమకొండలోని కలెక్టరేట్ ముందు వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి బీఎల్.వర్మ మాట్లాడారు. ముందుగా ప్రధాని నరేంద్ర మోదీ మన్ కి బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. వ్యవసాయం చేసే రైతులకు ఎకరానికి రూ.2వేల ఆర్థిక అందించడంతోపాటు కిసాన్ భరోసా కింద సబ్సిడీ ఎరువులను సైతం కేంద్రం పంపిణీ చేస్తోందన్నారు. సబ్సిడీ గ్యాస్, ఎరువులు, ముద్ర లోన్లు, ఆయుష్ భారత్, బాలికల కోసం సుకన్య సమృద్ధి యోజన, సురక్ష యోజన ఇలా ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టారని తెలిపారు. పేదరిక నిర్మూలన, పేదల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందని కేంద్ర మంత్రి అన్నారు. అనంతరం వికాసిత్ భారత్ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్, బీజేపీ నాయకులు కొలను సంతోష్‌రెడ్డి, దేశిని సదానందంగౌడ్, కుమారస్వామి, రాంచంద్రారెడ్డి, జైపాల్‌రెడ్డి, మధుసూదన్‌రావు, శ్రీనివాస్, రాజు, కళ్యాణ్, శ్రీధర్, అన్వేష్, వాణిశ్రీ, వివిధ బ్యాంకులకు చెందిన చెందిన ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వికాసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న బీఎల్.వర్మ

ఏపీలో గుట్టుగా
ఇసుక దోపిడీ షురూ!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏపీలో గుట్టుగా ఇసుక దోపిడీ షురూ అయింది. 2023-25 కాలానికిగాను ఇసుక తవ్వకాలు, అమ్మకాలకు సంబంధించిన టెండర్ల వ్యవహారమంతా సీక్రెట్‌గా జరిగిపోయింది. జగన్ సర్కారు కంపెనీలను ఎంపిక చేసి అమ్మకం బాధ్యతలు కూడా అప్పగించింది. ఉత్తర్వులు కూడా జారీ చేసింది. వాటిలో ఒకటి తెలంగాణకు చెందిన మాజీ ఎంపీ, బీఆర్ఎస్ ముఖ్యనేత బోయినపల్లి వినోద్‌కుమార్ సోదరుడు శ్రీనివాసరావుకు చెందిన ప్రతిమ కంపెనీ. ఆయన తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు స్వయానా మేనల్లుడు. మరొకటి రాజస్థాన్‌కు చెందిన జీసీకేసీ కంపెనీ. కంపెనీలతో జగన్ సర్కారు డిసెంబరు 11న సీక్రెట్ గా ఒప్పందాలు చేసుకుంది. అదే రోజు నుంచి ఇసుక అమ్మకం బాధ్యతలను వాటికి అప్పగించింది. కానీ.. డిసెంబరు 22న గనుల శాఖ దీనిపై కలెక్టర్లకు, అధికారులకు లేఖ రాసింది. అగ్రిమెంట్ కుదిరిన రోజు నుంచే ప్యాకేజీల వారీగా ఆయా జిల్లాల్లో ఆయా సంస్థలు ఇసుక తవ్వకాలు, అమ్మకాలు చేస్తున్నట్లుగా పరిగణించాలని గనుల శాఖ డైరెక్టర్ ఆ లేఖలో సూచించడం గమనార్హం. ఈ జగన్నాటకం వెనుక మరో పెద్ద రహస్యం ఉంది. అదేంటంటే.. కంపెనీలు ఏవైనా, ఇసుక అమ్మకాలను పర్యవేక్షించేది ముఖ్యమంత్రి తమ్ముడు అనిల్‌రెడ్డే. ఏపీ సర్కారుకు వేల కోట్ల ఆదాయం తెచ్చిపెట్టే ఈ ఇసుక అమ్మకాల వ్యవహారంలో అంతా రహస్యమే. రాయల్టీ, ఫీజులు ఎంతో.. వెల్లడించడం లేదు. కీలకమైన పర్యావరణ అనుమతుల విషయంపై కూడా గప్‌చుప్! వైసీపీ సర్కారు గతంలో జేపీ వెంచర్స్‌కు ఇసుక టెండర్ ఇచ్చినప్పుడు.. దాని విలువ ఎంతో ప్రకటించింది. నిబంధనలు, చెల్లించాల్సిన రాయల్టీ, సీనరేజీ, కన్సిడరేషన్ ఫీజులు ఎంతో ముందే ప్రకటించింది. కానీ ఇప్పుడు మాత్రం ఆ వివరాలన్నింటినీ రహస్యంగా ఉంచుతోంది.

నిబంధనలను తోసిరాజని..

టెండర్ నిబంధనల ప్రకారం.. ఇసుక వ్యాపారం చేసిన అనుభవం ఉన్న సంస్థలకే పనులు అప్పగించాలి. కానీ.. ప్రతిమ కంపెనీకి ఇంతకుముందు ఇసుక వ్యాపారం చేసిన అనుభవం లేదు. జీసీకేసీదీ అదే పరిస్థితి. అయినా నిబంధనలు తోసిరాజని ఆ కంపెనీలకు పనులు అప్పగించారు. ఇలా అక్రమంగా ఇసుక టెండర్లు దక్కించుకున్న ప్రతిమ, జీసీకేసీలు ఇసుక తవ్వకాలు, అమ్మకాల వ్యాపారం మొదలుపెట్టాయి. అయితే ఇసుక అమ్మకాల సందర్భంగా ఇచ్చే రహదారి బిల్లులపై కీలకమైన జీఎస్టీ నంబర్‌ను మాత్రం జీసీకేసీ సంస్థ ముద్రించట్లేదు. దీంతో ఆ సంస్థ జీఎస్టీ నంబరు తీసుకోకుండానే ఇసుక వ్యాపారం మొదలుపెట్టిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాన్ని గనుల శాఖ చూసీచూడనట్టు వదిలేస్తోంది. అలాగే.. ఇసుక తవ్వకాలకు విధిగా పర్యావరణ అనుమతులు కావాలి. కానీ, కొత్తగా ఆ అనుమతులు లేకుండానే టెండర్లు నిర్వహించడం గమనార్హం.

చంద్రుతండా గ్రామ కమిటీ ఎన్నిక

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 31: మండలంలోని చంద్రు తండా గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని పార్టీ జిల్లా నాయకుడు మంతెన ఇంద్రసేనరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా భూక్య హమును, ఉపాధ్యక్షుడిగా రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఇంద్రసేన రెడ్డి మాట్లాడుతూ టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సింగపురం ఇందిర, పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్ రెడ్డి ఆదేశాలమేరకు కమిటీని ఎన్నుకున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని, కాంగ్రెస్ పార్టీ అంటేనే బడుగు బలహీన వర్గాల పార్టీ అని అన్నారు. గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసేందుకే కమిటీలను నియమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్య రాజు, ఎంపీటీసీ మాలోతు లలిత-శ్రీనివాస్, నాయకులు లింగన్న, మార్క రాజు, నర్ర రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్య స్థాపనే ధ్యేయం

జనగామ టౌన్, డిసెంబరు 31: బహుజన రాజ్య స్థాపనే తమ ధ్యేయమని బీఎస్పీ జనగామ జిల్లా నూతన అధ్యక్షుడు మడిపడిగ చంద్రశేఖర్ అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చంద్రశేఖర్‌ను జిల్లా అధ్యక్షుడిగా నియమించిన సందర్భగా స్థానిక నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు జిల్లా అధ్యక్ష పగ్గాలు అప్పగించిన ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జేరిపోతుల కుమార్, రాపాక శ్రీశైలం, ఇరుగు మహేందర్, నాగులపల్లి అశోక్, కల్వల దయాసాగర్, కొంపల్లి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.


బచ్చన్నపేటలో అక్షింతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న తీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యులు


పాలకుర్తిలో శోభా యాత్ర నిర్వహిస్తున్న ధార్మిక సంఘాల బాధ్యులు

వైభవంగా శోభాయాత్ర


బచ్చన్నపేట, డిసెంబరు 31: రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలతో ఆదివారం పెద్ద ఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక చౌరస్తా నుంచి చెన్నకేశవ ఆలయం వరకు యాత్ర నిర్వహించి వివిధ గ్రామాల నుంచి వచ్చిన గ్రామ కమిటీలకు అక్షింతలు అందజేశారు. ఈ సందర్భంగా తీర్థక్షేత్ర ట్రస్ట్ జిల్లా ప్రతినిధులు దొంతుల శేఖర్, మంచాల రవీందర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాలకు అక్షింతలు అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లో జనవరి 1 నుంచి 15 వరకు ఇంటింటికీ పంపిణీ చేస్తామన్నారు. ఇందుకోసం మండల, గ్రామ కమిటీలు వేశామన్నారు. శోభాయాత్రకు వేలాదిగా భక్తులు తరలిరావటం ఆనందంగా ఉందన్నారు. ఈ కమిటీలు ఈనెల 22 వరకు పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి రాజయ్య, సద్ది సోమిరెడ్డి, పెండెం నగేష్, పురాణం రాంబాబు, కొండి వెంకట్‌రెడ్డి, దొంతుల చంద్రమౌళి, ఏల కృష్ణ, పులిగిళ్ల ముఖేష్, జూకంటి గణేశ్ పాల్గొన్నారు.

పాలకుర్తి: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలతో ఆదివారం మండల కేంద్రంలో శోభా యాత్ర నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, ఆరెస్సెస్, హిందూ ధార్మిక విభాగం, భజరంగదళ్ ఆధ్వర్యంలో సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి ఆలయం నుంచి రాజీవ్ చౌరస్తా, గుడివాడ చౌరస్తా వరకు యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా సమయోజకులు ఇమ్మడి దామోదర్, తాళ్లపల్లి సోమనారాయణ మాట్లాడుతూ హిందువుల దశాబ్దాల కాలంనాటి కల నెరవేరిందని అన్నారు. అక్షింతలను ప్రతీ ఇంటికి చేరుస్తామన్నారు. కార్యక్రమంలో దొంగరి మహేందర్, సుధాకర్‌రెడ్డి, వేల్పుల దేవరాజ్, శ్రావన్, లక్ష్మీనారాయణ, గంగు నవీన్, రాజమౌళి, శంకరయ్య, అరవింద్ పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

- వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారి డాక్టర్ సుగుణాకర్‌రాజు

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 31: సాయుధ పోరట వీర వనిత చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారి డాక్టర్ సుగుణాకర్‌రాజు తెలిపారు. ఆదివారం మండలంలోని తాటికొండ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాట్లను రజక సంఘం జిల్లా నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి పోరాట యోధులను, వారి చరిత్రను తెలుసుకోవడానికి గాను విగ్రహాలు దోహదపడుతాయన్నారు. చాకలి ఐలమ్మ అన్ని వర్గాల ప్రజలకు ఆదర్శప్రాయురాలన్నారు. ఐలమ్మ విగ్రహం ఏర్పాటులో తన వంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి, సర్పంచ్ చల్లా ఉమాదేవి, ఉప సర్పంచ్ మారపాక రాములు, రజక సంఘం జిల్లా బాధ్యుడు అక్కెనపల్లి అంజయ్య, సత్తయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


తాటికొండలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ సుగుణాకర్‌రాజు

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి


తమ్మడపల్లి(జి)లో మాట్లాడుతున్న ఎస్ఐ మహేందర్

జఫర్‌గడ్, డిసెంబరు 31 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జఫర్‌గడ్ ఎస్ఐ మహేందర్ కోరారు. శనివారం రాత్రి తమ్మడపల్లి(జి)లో వరంగల్ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో జాగృతి పోలీసు కళాబృందంచే చైతన్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్, గుట్కా వంటి చెడు అలవాట్లకు బానిసలుగా మారి వారి జీవితాలను నాశనం చేసుకోవద్దని, చదువే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. సన్మార్గంలో పయనిస్తూ సమాజంలో ఆదర్శంగా నిలవాలని సూచించారు. నేరాల నియంత్రణకు దోహదపడే సీసీ కెమెరాలను గ్రామాల్లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. బాల్యవివాహాలు చేయవద్దని, బడిఈడు పిల్లలను బాలకార్మికులుగా మార్చవద్దని.. వారి ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడాలని తల్లిదండ్రులను కోరారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామంలో ఎలాంటి అశాంతియుత ఘటనలు లేకుండా ప్రజలు ప్రశాంతంగా జీవించాలన్నారు. కాగా, కళాజాత బృందం కళాకారులు మూఢ నమ్మకాలు, బాల్యవివాహాల నిర్మూలన, గుడుంబా, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు, వల్ల కలిగే నష్టాలు, తదితర సామాజిక అంశాలపై కళారూపాల్లో అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఏఎస్ఐ రాజమౌళి, హెడ్ కానిస్టేబుళ్లు మన్సూర్‌నాయక్, రవిందర్, గణేష్, డబ్ల్యుఏఎస్ఐ నాగమణి, కళాజాత బృందం సభ్యులు విలియం, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, విక్రంరాజు, చిరంజీవి, పోలీసులు పాల్గొన్నారు.

కొడకండ్లకు బాడీఫ్రీజర్ అందజేత

కొడకండ్ల, డిసెంబరు 31: కొడకండ్ల లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పేరం రాము ఆధ్వర్యంలో జిల్లా గవర్నర్ వెంకటేశ్వర్‌రావు సహకారంతో సభ్యులు మండలానికి బాడీఫ్రీజర్‌ను అందజేశారు. వారు మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం సర్పంచ్ పసునూరి మధుసూదన్, పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాస్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఎవరికి అవసరమైనా తీసుకెళ్లి తిరిగి జాగ్రత్తగా అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ దోర్నం ప్రభాకర్, సభ్యులు కోటేశ్వర్, దామెర రమేశ్, జ్ఞానేశ్వరాచారి, ప్రసన్న, ఉపేందర్, సోమన్న తదితరులు పాల్గొన్నారు.


సర్పంచ్, కార్యదర్శికి బాడీఫ్రీజర్‌ను అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

ఏసీపీ సుందరగిరి శ్రీనివాస రావు

చిలుపూర్, డిసెంబరు 31 : నూతన సంవత్సరంలో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ సుందరగిరి శ్రీనివాస రావు ఆదేశించారు. ఆదివారం జనగామ రూరల్ సీఐ ఎడవల్లి శ్రీనివాసరెడ్డితో కలిసి చిలుపూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన వివిధ నేరాలకు సంబంధించి ఇటీవల నమోదైన కేసుల రికార్డులను పరిశీలించారు. గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను స్థానిక ఎస్సై బొల్లం


చిలుపూర్ పీఎస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఏసీపీ

వినయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. భూతగాదాలకు సంబంధించి ఫిర్యాదుల విషయంలో పారదర్శకంగా వ్యవహరించడంతో పాటు, గ్రామాల్లో ప్రతీరోజు పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని ఎస్సైని ఆదేశించారు. వివిధ సమస్యల విషయమై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల సిబ్బంది స్నేహపూర్వకమైన ధోరణితో వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కడియంను కలిసిన మల్కాపూర్ ముదిరాజ్ సంఘం నాయకులు

కమ్యూనిటీ హాల్‌కు నిధులివ్వండి

ఎమ్మెల్యే కడియంను కోరిన ముదిరాజ్ సంఘం నాయకులు

చిలుపూర్, డిసెంబరు 31 : అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు అవసరమైన రూ.10 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరుతూ మల్కాపూర్ ముదిరాజ్ సంఘం నాయకులు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆదివారం స్థానిక ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు ఊరడి సతీష్ నేతృత్వంలో సంఘ సభ్యులంతా హన్మకొండలోని కడియం నివాసంలో ఆయనను కలిసి సమస్యను విన్నవించారు. గతంలో మంజూరు చేసిన రూ.10 లక్షల నిధులతో 50 శాతం పనులు పూర్తయ్యాయని, మరో రూ.10 లక్షలు మంజూరు చేస్తే భవన నిర్మాణం పూర్తవుతుందని కడియంకు తెలిపారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు సతీష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అలుగు అబ్బయ్య, నాచు రాజు, ఊరడి రాజు, చొప్పరి రాజ్‌కుమార్, పెండెం అశోక్, చొప్పరి రాజు తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో దొంగనోట్ల కలకలం


నకిలీ వంద రూపాయల నోటు

వర్ధన్నపేట, డిసెంబరు 31: వర్ధన్నపేట పట్టణంలో దొంగ నోట్లు చలామణి అవుతున్నాయి. స్థానిక రేషన్ షాపు, పెట్రోల్ బంకుల్లో గుర్తు తెలియని వ్యక్తులు రూ.100 నోట్లు ఇస్తున్నారు. ఆదివారం ఓ పాన్‌షాపులో ఓ వ్యక్తి రూ.100 నోటు ఇచ్చి పాను తీసుకొని మిగిలిన చిల్లర తీసుకున్నాడు. అదేవిధంగా పెట్రోల్ బంక్‌లో సైతం ఇలాగే పెట్రోల్, డీజిల్ పోయించుకున్నట్లు సమాచారం. బాధితులకు అనుమానం వచ్చి నోట్లను పరిశీలించి బ్యాంకు అధికారులకు చూపగా, వారు పరిశీలించి నకిలీ నోట్లుగా గుర్తించారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. పాన్‌షాపు, కిరాణ దుకాణం లాంటి చిన్న చిన్న షాపుల్లో దొంగనోట్లు మార్చుతున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయం పోలీసులకు చేరడంతో దొంగ నోట్ల వ్యవహారంపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

వేధింపుల కేసులో ముగ్గురి అరెస్టు

కాజీపేట, డిసెంబరు 31: వరకట్న వేధింపుల కేసులో కాజీపేట పోలీసులు ఆదివారం ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. కట్నం కోసం అత్తింటి వేధింపులు తట్టుకోలేక డిసెంబరు 20న కాజీపేటలో ఉమ్మె కుల్సా (28) అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఆమె తల్లి జహీరా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఆదివారం కుల్సా భర్త యాకుబ్ పాషా, అత్త ఫాతిమా, మామ సండే సాహెబ్‌లను ఖమ్మంలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

'మన్‌కీ బాత్' వీక్షించిన బీజేపీ నాయకులు

జనగామ టౌన్, డిసెంబరు 31: ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌడ రమేశ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తోన్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ కోకన్వీనర్ కొంతం శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రం, గుగులోతు ఉదయ్‌చందర్, కార్యాలయ సెక్రటరీ చందు పాల్గొన్నారు.

టీపీయూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

జనగామ టౌన్, డిసెంబరు 31: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) 2024 సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివారం జనగామలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాము, సంఘం జిల్లా అధ్యక్షుడు మంద రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా తిరుపతిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేణుగోప పాల్, పంచాక్షరి కార్యవర్గ సభ్యులు మనోజ్‌కుమార్, కోటయ్య, అనిత, మండలాల అధ్యక్ష, కార్యదర్శులు సీవీఎల్ఎన్ రెడ్డి, రవికుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


జనగామలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టీపీయూఎస్ నాయకులు

నూతన సంవత్సరంలో ఎవరి ఆశలు ఎలా ఉన్నాయంటే..

లింగాలఘణపురం/జనగామ టౌన్/జఫర్‌గడ్, డిసెంబరు 31: ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' పలువురిని పలకరించింది. వారి ఆశలు, ఆకాంక్షలు ఎలా ఉన్నాయని ఆరా తీసింది. ఎక్కువ మంది అవినీతిని పాతరపెట్టాలని, విద్య..వైద్యం సామాన్యులకు అందుబాటులోకి తేవాలని, నిత్యావసర సరుకుల ధరలను అదుపులో ఉండాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆశిస్తున్నారు. వివరాలు వారి మాటల్లోనే..

- విద్య.. వైద్యం ఉచితం కావాలి..



కామని భరత్‌కుమార్- జనగామ

ప్రజలకు ప్రభుత్వాలు ఉచిత పథకాలు అందజేసే రాష్ట్ర ఖజానాను ఖాళీ చేయడం కంటే కార్పొరేట్ స్థాయి ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించే దిశగా ప్రభుత్వం ఆలోచించాలి. సామాన్యుడి సంపాదనంతా పిల్లల చదువులకు, ఆస్పత్రుల ఖర్చులకే సరిపోతోంది. పూర్వీకులు సంపాదించి వారసత్వంగా పంచిచ్చిన ఆస్తులను విద్య, వైద్యానికే కరగబెట్టాల్సిన దుస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించాలి.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి..



ఆది సాంబయ్య- రైతు, నవాబుపేట

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 80 శాతం ఉన్న రైతుల జీవన స్థితిగతులపై దృష్టి సారించాలి. పంటలకు గిట్టుబాటు ధరలు లభించినప్పుడే వ్యవసాయం మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతుంది. అన్నంపెట్టే రైతన్నలను ప్రభుత్వం అప్పుల పాల్జేయకుండా ఎరువులు, పురుగు మందులు, అవసరమైన సాగునీటి లభ్యతను పెంపొందించాలి.

ఉద్యోగావకాశాలు కల్పించాలి..



గండి కుమార్- నిరుద్యోగి, వడ్డిచర్ల

యువతకు ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలను కల్పించాలి. నిరుద్యోగ భృతిని పక్కనబెట్టి అర్హులైన ప్రతీ ఒక్కరికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలి. ప్రస్తుతం ఉద్యోగాల్లేక ఎంతో మంది నిరుద్యోగులు నిరాశ నిస్పృహలతో ఉన్నారు. వారు సొంతకాళ్లపై నిలబడేలా పాటుపడాలి.

రైతులకు పరికరాలపై సబ్సిడీ ఇవ్వాలి..



- కుషాకర్, రైతు, వడ్లకొండ

కాలం మారుతున్న కొద్దీ వ్యవసాయంలో అనేక మార్పులు వస్తున్నాయి. ఆధునిక వ్యవసాయం దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచించాలి. ప్రస్తుతమున్న ప్రధాన సమస్య కూలీల కొరత. కాబట్టి రైతులు మెషీన్లపై ఆధారపడాల్సి వస్తోంది. ముఖ్యంగా నాటు వేసే మిషన్లు, డ్రోన్ స్ప్రేయర్లను సబ్సిడీపై ఇవ్వాలి. దీనివల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

పేదలకు సంక్షేమం అందాలి..



తాడూరి నరేశ్, ప్రైవేట్ ఎంప్లాయ్, జనగామ

కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యంపై దృష్టి పెట్టాలి. పేద, మధ్యతరగతి వారికి కార్పొరేట్ స్థాయిలో విద్యనందించేందుకు చర్యలు చేపట్టాలి. గ్రామానికో హాస్పిటల్ ఏర్పాటు చేసి ఆరోగ్య గ్రామాలుగా తీర్చిదిద్దాలి. నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలి.

ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలి..



- వంగ సతీశ్, జనగామ

గత ప్రభుత్వం నిరుద్యోగులకు తీరని అన్యాయం చేసింది. ఉద్యోగ భర్తీలు ఖాళీ చేయలేదు. మరోవైపు పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలు ఆగమయ్యాయి. ఈసారి అలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలి. వీలైనంత త్వరగా ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలి. అంతేగాకుండా నిరుద్యోగులకు ఉచితంగా కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి.

కల్తీలేని విత్తనాలను అందించాలి..



ధరంసోత్ సోమ్లానాయక్, రైతు, టీబీ తండా

పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోవడంతో వ్యవసాయం భారమైంది. కొత్త ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై కల్తీలేని విత్తనాలు అందించాలి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలను నష్టపోతే ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి. వ్యవసాయ ఉపకరణాలను రాయితీపై అందించాలి. ఎరువులు, పురుగుల మందుల ధరలను తగ్గించాలి. రుణ మాఫీని వెంటనే అమలు చేయాలి.

నిరోద్యోగ భృతి చెల్లించాలి..



ఎండి.జలీల్ అహ్మద్, నిరుద్యోగి, జఫర్‌గడ్

నేను బీటెక్ చదివాను. ఎలాంటి ఉద్యోగం రాలేదు. జఫర్‌గడ్‌లో చెప్పుల దుకాణం నడుపుకుంటున్నాను. నూతన ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తుందని ఆశతో ఉన్నాం. వెంటనే నిరుద్యోగ భృతి చెల్లించాలి. పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి.

ఫీజుల భారం తగ్గించాలి..

కర్నాటకం కుమారస్వామి, కరెంట్ మెకానిక్, జఫర్‌గడ్



నాకు ఇద్దరు పిల్లలు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తున్నా. ఇళ్లల్లో కరంట్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. పిల్లల ఫీజులు చెల్లించడం భారమవుతోంది. నిత్యావసర ధరలు మండి పోతున్నాయి. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు తగ్గించాలి. నూతన ప్రభుత్వంలో నైనా ధరలు తగ్గుతాయని, ఆర్థిక ఇబ్బందులు తొలుగుతాయని ఆశిస్తున్నాను.

యువత సన్మార్గంలో నడవాలి: ఎస్సై


బచ్చన్నపేటలో యువకులతో మాట్లాడుతున్న ఎస్ఐ సతీష్

బచ్చన్నపేట, డిసెంబరు 31: యువత సన్మార్గంలో నడవాలని బచ్చన్నపేట ఎస్ఐ సతీష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో యువకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు అలవాటుపడరాదన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడి ఆరోగ్యం పాడుచేసుకోవద్దని, ఆర్థికంగా, శారీరకంగా నష్టపోవద్దని సూచించారు. లేదంటే కుటుంబాలు వీధినపడుతాయని హెచ్చరించారు. క్రమశిక్షణ కలిగిన జీవితం అలవర్చుకునేందుకు చిన్నప్పటి నుంచే ప్రయత్నించాలన్నారు. సంఘ వ్యతిరేక శక్తులతో సహవాసం మంచిదికాదన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు.

వేడుకలు శ్రుతి మించొద్దు: ఎస్సై నరేష్

తరిగొప్పుల, డిసెంబరు 31: న్యూ ఇయర్ వేడుకలను పురస్కరించుకుని మండలంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తరిగొప్పుల ఎస్సై దూదిమెట్ల నరేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యూ ఇయర్ వేడుకలను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని, శ్రుతి మించి శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.